సాక్షి మెదక్

శనివారం । 16 । డిసెంబర్ । 2023



రుణపాశం.. విషాదం

ఆర్థిక సమస్యలు, ఆన్‌లైన్ రమ్మీ గేమ్ ఓ కుటుంబానికి శాపంగా మారింది.

వివరాలు 8లో ▸



దొంగల బీభత్సం

దొంగలు తూప్రాన్‌లో తాళం వేసిన ఇళ్లను టార్గెట్ చేశారు.

వివరాలు 8లో ▸



కార్తీక సిరులు

ఉమ్మడి జిల్లాలో సుప్రసిద్ధమైన నాచారంగుట్ట పుణ్యక్షేత్రానికి ఈ కార్తీక మాసంలో అధిక ఆదాయం సమకూరింది.

వివరాలు 8లో ▸

న్యూస్‌రీల్

దుర్గమ్మా.. చల్లంగా చూడు

101 టెంకాయలు కొట్టి మొక్కు తీర్చిన సునీతారెడ్డి



దుర్గమ్మ సేవలో ఎమ్మెల్యే సునీతారెడ్డి

పాపన్నపేట(మెదక్): నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతారెడ్డి ఏడుపాయల దుర్గమ్మకు మొక్కు చెల్లించారు. తాను గెలిస్తే 101 టెంకాయలు కొడతానని మొక్కారు. ఆ మేరకు అసెంబ్లీ ఎన్నికల్లో నర్సాపూర్ ఎమ్మెల్యేగా ఆమె గెలుపొందటంతో శుక్రవారం మాజీ ఎమ్మెల్యే మదన్‌రెడ్డి, కార్యకర్తలతో కలిసి ఆమె అమ్మ వారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా పూజారులు, ఆలయ చైర్మన్ బాలాగౌడ్, ఈఓ మోహన్‌రెడ్డి వారికి ఆలయ మర్యాదల ప్రకారం పూర్ణ కుంభంతో స్వాగతం పలికారు. అనంతరం పూజారులు అర్చన గావించి తీర్థప్రసాదాలు అందజేశారు. నేతల వెంట ధర్మకర్తలు మనోహర్, మోహన్‌రావు, యాదగౌడ్, బాగారెడ్డి, సూర్యశ్రీనివాస్, శ్రీనివాస్ శర్మ పాల్గొన్నారు.

డిజిటల్ సిగ్నేచర్ బాధ్యత కార్యదర్శిదే

కొత్తపల్లి సర్పంచ్ జగన్నాథం



మాట్లాడుతున్న సర్పంచ్ జగన్

పాపన్నపేట(మెదక్): పంచాయతీ కార్యదర్శి చేసిన తప్పుకు తానెలా బాధ్యుడిని అవుతానంటూ కొత్తపల్లి సర్పంచ్ జగన్నాథం ఆవేదన వ్యక్తం చేశారు. శుక్రవారం వార్డు సభ్యులు రాజు, మహేశ్, కవిత, బూదమ్మ, పెంటమ్మతో కలిసి ఆయన మాట్లాడారు. కొంతమంది రాజకీయ కక్షతో తనపై తప్పుడు ఆరోపణలు చేస్తున్నారన్నారు. గతంలో ఉపసర్పంచ్ అంజలి భర్త సత్యనారాయణ ప్రతి బిల్లుకూ కమీషన్లు తీసుకునేవాడని విమర్శించారు. దీంతో అప్పట్లో ఉపసర్పంచ్ అంజలి జాయింట్ చెక్ పవర్ తొలగించారని చెప్పారు. ఇటీవల ఆమెకు చెక్ పవర్‌ను పునరుద్ధరించారని వెల్లడించారు. డిజిటల్ సిగ్నేచర్ తీసుకోవాల్సిన బాధ్యత కార్యదర్శిదేనని పేర్కొన్నారు. తాను మాజీ ఎమ్మెల్యే పద్మాదేవేందర్ రెడ్డి, అప్పటి మంత్రి హరీశ్‌రావు సహకారంతో కొత్తపల్లి ఆదర్శ పంచాయతీ అవార్డు అందుకుందని చెప్పారు. తాను తీసుకున్న బిల్లులు నిబంధనల ప్రకారం పనులు చేసి, ఎంబీ(కొలతలు) రికార్డు చేశామన్నారు.

ఓటరు నమోదుపై అవగాహన



సమావేశంలో మాట్లాడుతున్న శ్రీనివాస్

కౌడిపల్లి(నర్సాపూర్): 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరినీ ఓటరుగా నమోదు చేయాలని నర్సాపూర్ ఆర్‌డీఓ శ్రీనివాస్ బీఎల్‌ఓలను ఆదేశించారు. శుక్రవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో ఓటరు నమోదుపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్ని గ్రామాలు, తండాల్లోని అర్హులకు ఓటరు నమోదుపై అవగాహన కల్పించాలని తెలిపారు. కొత్తగా ఓటరు నమోదు, సవరణలు, మార్పుల చేపట్టాలని సూచించారు. మృతిచెందిన వారి ఓట్లను తొలగించాలని చెప్పారు. ఈ విషయమై నిర్లక్ష్యం చేయవద్దని వెల్లడించారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఆంజనేయులు, డిప్యూటీ తహసీల్దార్ తారాబాయ్, ఆర్ఐ శ్రీహరి, బీఎల్ఓలు పాల్గొన్నారు.

మెనూ ప్రకారం భోజనం

బీసీ సంక్షేమశాఖ అధికారి శంకర్ నాయక్

మెదక్ కలెక్టరేట్: సంక్షేమ హాస్టళ్ల విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం అందించాలని, చదువుకునేందుకు ప్రశాంత వాతావరణాన్ని కల్పించాలని బీసీ సంక్షేమశాఖ అధికారి శంకర్ నాయక్ సూచించారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని బీసీ వెల్ఫేర్ కార్యాలయంలో బీసీ హాస్టళ్ల వార్డెన్లతో నెలవారీ సమీక్ష నిర్వహించారు. విద్యార్థులు సీజనల్ వ్యాధుల బారిన పడకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని, ఎప్పటికప్పుడు హెల్త్ చెకప్‌లు చేయించాలని సూచించారు. హాస్టళ్లలో నెలకొన్న సమస్యలను వార్డెన్లు అధికారికి వివరించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ అధికారి నాగరాజు గౌడ్, వార్డెన్లు మనోహర్, భానుసింగ్, శ్రీనివాస్, నర్సింలు, పుణ్యమ్మ, గాయత్రి, సిబ్బంది తాళ్లపల్లి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

మళ్లీ జోనల్ లొల్లి

రాజన్నసిరిసిల్ల జోన్ నుంచి మెదక్ జిల్లాను మార్చాలి

- తెరపైకి వస్తున్న డిమాండ్‌లు
- ఇటీవల ఎన్నికల ప్రచారంలో హామీనిచ్చిన ప్రజాప్రతినిధులు
- ప్రజావాణిలో యువత వినతితో.. మరోసారి చర్చ



హైదరాబాద్ నిర్వహించిన ప్రజావాణిలో వినతిపత్రం అందజేసిన ప్రతిని చూపిస్తున్న యువకులు

మెదక్ జిల్లాను రాజన్న సిరిసిల్ల జోన్ నుంచి వేరు చేసి చార్మినార్ జోన్‌లో కలపాలన్న డిమాండ్ మళ్లీ తెర పైకి వచ్చింది. జిల్లాలో ఆందోళనలు మెల్లగా పుంజుకుని జిల్లా అంతటా విస్తరిస్తున్నాయి. జోన్ మార్చాలని జిల్లాలోని విద్యార్థులు, నిరుద్యోగులు, ఉద్యోగులు, ఉపాధ్యాయులు మేధావులు, ఆయా వర్గాల ప్రజలు తమ ప్రాంతాల్లోని ప్రభుత్వ అధికారులకు, ప్రజాప్రతినిధులకు వినతిపత్రాలు అందజేస్తున్నారు.

నర్సాపూర్: ఉమ్మడి ఆంధ్రలో ఉమ్మడి మెదక్ జిల్లా హైదరాబాద్ జోన్‌లో ఉండేది. తెలంగాణ ఏర్పాటు తర్వాత రాష్ట్రంలో కొత్త జోనల్ వ్యవస్థను ఏర్పాటు చేశారు. జిల్లాను రాజన్నసిరిసిల్ల జోన్‌లో కలుపుతారన్న ప్రతిపాదనలు రాగానే నిరుద్యోగులు, ఉద్యోగులు ఉపాధ్యాయులు, విద్యార్థులు, మేధావులు వ్యతిరేకించారు. కానీ జిల్లాను చార్మినార్ జోన్‌లో కలపాలని జిల్లాకు చెందిన అధికార పార్టీ ప్రజాప్రతినిధులకు వినతిపత్రాలు అందజేసినా స్పందించక పోవడంతో సిరిసిల్ల జోన్‌లో జిల్లాను కలుపుతూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది.

ఇబ్బందులు

మెదక్ జిల్లాను రాజన్నసిరిసిల్ల జోన్‌లో కలపడంతో జోన్ కేంద్రానికి వెళ్లాలంటే సుమారు 125 నుంచి 175 కిలోమీటర్ల దూరం ప్రయాణం చేయాల్సి వస్తోంది. అదే చార్మినార్ జోన్‌లో జిల్లా ఉంటే వంద కిలోమీటర్ల లోపే ప్రయాణం ఉంటుంది. కాగా ఉదయం వెళ్లి రాత్రి వరకు తమ స్వస్థలాలకు తిరిగి రావొచ్చు. జిల్లాలో ఉన్నత చదువులు అందుబాటులో లేవు. ఈ జిల్లా విద్యార్థులు హైదరాబాద్‌లో ఉన్నత చదువులు చదవాలంటే స్థానికేతరుల కిందకు వస్తున్నారు. దీంతో ఉన్నత విద్యకు దూరవుతున్నారు. కాగా సిద్దిపేట, కరీంనగర్ జిల్లాల్లో ఉన్నత చదువులకు కాలేజీలు అందుబాటులో ఉన్నాయి. ఇక్కడి యువత అన్ని రకాల ఉద్యోగాలలో ముందంజలో ఉండటం, మెదక్ జిల్లాకు చెందిన యువకులు ఉన్నత చదవులు అభ్యసించనందునా కిందిస్థాయి పోస్టులకే పరిమితం కావాల్సి వస్తుందన్న ఆవేదనలు వ్యక్తం అవుతున్నాయి. ఉద్యోగ ఖాళీలు సైతం సిరిసిల్ల జోన్‌లో తక్కువగా ఉండటంతో నష్టం ఉంటుందని, చార్మినార్ జోన్ పరిధిలో ఉద్యోగావకాశాలు ఎక్కువగా ఉండటంతో ఎక్కువమందికి ఉద్యోగాలు లభించే అవకాశాలు ఉంటాయని అంటున్నారు. ఉద్యోగులకు ప్రమోషన్లలో సైతం అన్యాయం జరుగుతోందని అంటున్నారు.

హామీలివ్వడంతో మళ్లీ ..

జిల్లాను రాజన్న సిరిసిల్ల జోన్ నుంచి మార్చి చార్మినార్‌జోన్‌లో చేర్చుతామని ప్రధాన పార్టీలు ఇటీవల జరిగిన సాధారణ ఎన్నికల ప్రచారం సందర్భంగా హామీలు గుప్పించాయి. ప్రస్తుత సీఎం రేవంత్‌రెడ్డి నర్సాపూర్ ఎన్నికల ప్రచార సభలో అప్పుడు ఏమన్నారంటే.. తాము అధికారంలోకి వస్తే జిల్లాను చార్మినార్ జోన్‌లో కలుపుతామన్నారు. అప్పటి మంత్రి కేటీఆర్ సైతం నర్సాపూర్‌లో ర్యాలీలో ఇదే హామీని ప్రకటించారు. రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి రాగా జోన్ మార్పు కాగలదన్న ఆశ జిల్లా ప్రజల్లో చిగురించింది. కొత్త జోన్‌లోకి మార్చాలన్న డిమాండ్‌తో కూడిన ఆందోళనలు ఆయా ప్రాంతాల్లో ఊపందుకుంటోంది.

వినతులు..

ఇటీవల సీఎం రేవంత్‌రెడ్డి ప్రజావాణిని ప్రారంభించారు. ఈ నియోజకవర్గానికి చెందిన నిరుద్యోగులు, ఉన్నత విద్య అభ్యసిస్తున్న విద్యార్థులు కిరణ్‌బాబు, విష్ణు, బాల్‌రాజ్, ప్రసాద్, ప్రకాశ్, సాయికిరణ్ తదితరులు శుక్రవారం హైదరాబాద్‌లో ఈ విషయమై వినతిపత్రం అందజేశారు. అలాగే నర్సాపూర్ పట్టణ ఏబీవీపీ ఆధ్వర్యంలో విద్యార్థి సంఘం నాయకులు అక్షయ్‌గౌడ్, వరుణ్ , సాయిరాం, అభినాశ్, ఆనంద్ అర్వింద్, నితిన్ తదితరులు సైతం తహసీల్దార్ కమలాద్రికి వినతి అందజేశారు.

జిల్లావాసులకు నష్టం



సిరిసిల్ల జోన్‌లో జిల్లాను కలపడంతో పలు విధాలుగా జిల్లా వాసులకు నష్టం కలుగుతోంది. ఉద్యోగాలు, ప్రమోషన్లలో సైతం 317 జీఓ ప్రకారం స్కూల్ అసిస్టెంట్, ఎస్‌జీటీ పోస్టులను ఇతర జిల్లాల వారితో నింపుతున్నారు. హైదరాబాద్ పరిధిలో మెదక్ జిల్లా నాన్ లోకల్ కావడంతో అక్కడ అవకాశాలను పొందలేకపోతున్నాం.

–ప్రసన్నకుమార్‌గౌడ్, ఉపాధ్యాయుడు

రవాణాకు దూరమవుతోంది



జిల్లాను హైదరాబాద్ జోన్‌లోకి మారిస్తే అనేక లాభాలు ఉంటాయి. సిరిసిల్ల జోన్ కేంద్రానికి వెళ్లాలంటే వ్యయ ప్రయాసాలకు గురి కావాల్సి వస్తోంది. చార్మినార్ జోన్‌లో కలిపితే హైదరాబాద్‌కు రవాణా సదుపాయాలు ఎక్కువ. దీంతో రాకపోకలు తేలిక.

–వంశీకృష్ణ, నిరుద్యోగి



అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లుకు అవిశ్వాస తీర్మాన ప్రతిని అందజేస్తున్న కౌన్సిలర్లు

మున్సిపల్ చైర్‌పర్సన్‌పై అవిశ్వాసం

అదనపు కలెక్టర్‌కు తీర్మాన ప్రతిని అందజేసిన కౌన్సిలర్లు

నర్సాపూర్: నర్సాపూర్ మున్సిపల్ చైర్మన్ మురళీ యాదవ్‌పై అవిశ్వాస తీర్మాన ప్రతిని కౌన్సిలర్లు శుక్రవారం అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లుకు అందజేశారు. ఇందులో మున్సిపాలిటీ వైస్ చైర్మన్ మహ్మద్ నయిమోద్దీన్, కౌన్సిలర్లు డి.అశోక్‌గౌడ్, ఇష్రత్ సిద్దిఖా, గొల్ల రుక్కమ్మ, పంబల్ల రాంచందర్, ఒంటిద్దు సునీత, చెల్మెటి లక్ష్మి, టి.సరిత, పంబల్ల లలిత తీర్మాన ప్రతిపై సంతకాలు చేశారు.

వేడెక్కనున్న రాజకీయం

మున్సిపల్ చైర్‌పర్సన్‌పై కౌన్సిలర్లు అవిశ్వాసం నోటీసు ఇవ్వడంతో పట్టణంలో మళ్లీ రాజకీయాలు వేడెక్కాయి. గత ఫిబ్రవరి 13న పలువురు కౌన్సిలర్లు అవిశ్వాస నోటీసును కలెక్టర్‌కు ఇవ్వగా రాష్ట్ర స్థాయిలో జరిగిన పరిణామాలు, పలు సాంకేతిక కారణాలతో అప్పట్లో నోటీసు రద్దయింది. తాజాగా శుక్రవారం తొమ్మిది మంది బీఆర్‌ఎస్ కౌన్సిలర్లు అవిశ్వాసం నోటీసు ఇవ్వడం రాజకీయంగా చర్చనీయాంశమైంది. మున్సిపాలిటీలో 15 మంది కౌన్సిలర్లు ఉన్నారు. ఈ ఎన్నికలు జరిగినప్పుడు మురళీయాదవ్ బీఆర్‌ఎస్‌లో ఉండటంపాటు ఈపార్టీ తరఫున ఎక్కువ మంది కౌన్సిలర్లు గెలవడంతో చైర్మన్ కాగలిగారు. అనంతరం జరిగిన రాజకీయ పరిణామాల నేపథ్యంలో బీఆర్‌ఎస్‌ను వీడి బీజేపీలో చేరారు. ఇటీవల జరిగిన సాధారణ ఎన్నికలలో ఆపార్టీ నుంచి ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేసి ఓటమి చెందారు. ఇప్పుడు బీఆర్‌ఎస్ కౌన్సిలర్లతోపాటు ఎమ్మెల్యే సునీతారెడ్డి సైతం మున్సిపాలిటీలో ఓటు వేసే అవకాశం ఉంది. దీంతో వీరికి పది ఓట్ల బలం ఉండగా కమలం పార్టీకి చైర్మన్‌తో కలిపి ఆరు ఓట్లే ఉన్నాయి. జిల్లా అధికారులు కౌన్సిలర్లు ఇచ్చిన ఈ నోటీసుపై సమావేశం ఏర్పాటు చేస్తే మున్సిపల్ చైర్మన్‌కు పదవి గండం పొంచి ఉంటుందని ప్రజలు భావిస్తున్నారు.

దివ్యాంగులు ఆర్థికాభివృద్ధిని సాధించాలి

అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు



ర్యాలీని ప్రారంభిస్తున్న బ్రహ్మాజీ

మెదక్ కలెక్టరేట్: దివ్యాంగులు ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకొని ఆర్థికాభివృద్ధి సాధించాలని అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు అన్నారు. అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవంలో భాగంగా శుక్రవారం జిల్లా కేంద్రంలో వారు ర్యాలీ నిర్వహించారు. స్థానిక ధ్యాన్‌చంద్ చౌరస్తా వద్ద స్త్రీ, శిశు సంక్షేమశాఖ, దివ్యాంగులు, వయోవృద్ధుల సంక్షేమశాఖ అధికారిణి బ్రహ్మాజీ జెండా ఊపి ర్యాలీ ప్రారంభించారు. అనంతరం ఇందిరాగాంధీ స్టేడియం వరకు చేరుకొని ర్యాలీ ముగిసింది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఇటీవల నిర్వహించిన పోటీల్లో సత్తా చాటిన ప్రతిభావంతులకు బహుమతులను ప్రదానం చేశారు. ఈ కార్యక్రమానికి అదనపు కలెక్టర్ విచ్చేసి జ్యోతి ప్రజ్వలన చేసిన అనంతరం మాట్లాడారు. ప్రభుత్వం నిర్వహిస్తున్న సదరం క్యాంపును, ప్రభుత్వ సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకుంటూ అభ్యున్నతి సాధించాలని తెలిపారు. దివ్యాంగుల సంఘం జిల్లా జేఏసీ చైర్మన్ విజయ్‌కుమార్ మాట్లాడుతూ వారి సంక్షేమానికి అధికారులు మొదట ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. డీడబ్ల్యూఓ బ్రహ్మాజీ మాట్లాడుతూ దివ్యాంగుల సంక్షేమానికి కృషి చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో అసిస్టెంట్ సీడీపీఓ వెంకటరమణమ్మ, ఈఓ పద్మలత, దివ్యాంగుల సంఘం నాయకులు గయాజొద్దీన్, దేవయ్య తదితరులు పాల్గొన్నారు.

టార్గెట్స్ పేరిట వేధింపులు



మెదక్ కలెక్టరేట్: హెడ్ పోస్టాఫీస్ ఎదుట సమ్మె చేస్తున్న జీడీఎస్‌లు

వెల్దుర్తి(తూప్రాన్): టార్గెట్ల పేరుతో ఉద్యోగులను వేధించడం ఆపేయాలని సంఘం జిల్లా కార్యదర్శి అంజనేయులు, వైస్‌కార్యదర్శి మహ్మద్ మజర్ అన్నారు. స్థానిక పోస్టాఫీస్ కార్యాలయం ఎదుట తపాలా ఉద్యోగులు ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. కమలేశ్ చంద్ర కమిటీ సిఫార్సు చేసిన సీనియార్టీ ఇంక్రిమెంట్, ఎక్స్‌గ్రేషియా, మెడికల్, పెన్షన్ అమలు చేయాలని డిమాండ్ చేశారు. ధర్నాలో రఘురాములు, అశోక్, వెంకటేశం, శ్రీశైలం, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

న్యాయమైన సమస్యలు పరిష్కరించాలి

మెదక్ కలెక్టరేట్: గ్రామీణ డాక్ సేవకుల(జీడీఎస్) న్యాయమైన సమస్యలను పరిష్కరించాలని జీడీఎస్ సంఘం మెదక్ డివిజన్ నాయకులు డిమాండ్ చేశారు. స్థానిక ప్రధాన తపాలా కార్యాలయం ఎదుట ఉద్యోగులు నిరవధిక సమ్మె శుక్రవారం సైతం కొనసాగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. జీడీఎస్‌లకు రెగ్యులర్ ఉద్యోగులతో సమానంగా వేతనాలు, అలవెన్సులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. అశాస్త్రీయమైన టార్గెట్‌లను వెంటనే నిలిపివేయాలని గొంతెత్తారు. వాట్సాప్‌ల ద్వారా పగలూరాత్రి బెదిరింపులకు పాల్పడటం తగదన్నారు. జీతాలు ఆపడం కూడా సరికాదని డిమాండ్ చేశారు. తమకు సీనియార్టీ ప్రకారం వెయిటేజీ కల్పిస్తూ 2016 జనవరి 1 నుంచి జీతాలు ఇవ్వాలని, గ్రాట్యూటీని రూ.5లక్షలకు పెంచాలని కోరారు. ప్రభుత్వం స్పందించి సమస్యలు పరిష్కరించే వరకూ సమ్మె కొనసాగిస్తామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షుడు అశోక్, కార్యదర్శి సిద్దిరెడ్డి, డివిజన్ కన్వీనర్లు ఆంజనేయులు, దుర్గయ్య, అనిల్‌కుమార్, సుజాత, నవీన, మురళి, వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.





ముసుగుకు ముందు.. తర్వాత వైఎస్సార్ విగ్రహం

విగ్రహాల ముసుగు తొలగింపు

సాక్షి ఎఫెక్ట్

కౌడిపల్లి(నర్సాపూర్): విగ్రహాలకు ముసుగును అధికారులు తొలగించారు. ఎన్నికల కోడ్ ముగిసినా మండలకేంద్రంలో దివంగత వైఎస్సార్, మాజీ ఎమ్మెల్యే చిలుముల విఠల్‌రెడ్డి విగ్రహాలకు తొడిగిన ముగుసు తీయలేదు. దీనిపై ఈనెల 13న సాక్షి దినపత్రిక.. ముసుగులోనే విగ్రహాలు పేరిట కథనాన్ని ప్రచురించింది. దీనిపై శుక్రవారం అధికారులు స్పందించి నేతల విగ్రహాలకు ముసుగును తొలగింపజేశారు.

అతివేగమే.. అనర్థం తెచ్చింది..

ట్రాక్టర్ బోల్తా పడి ఒకరి మృతి, మరొకరికి గాయాలు



ప్రశాంత్‌ను ఆస్పత్రికి తరలిస్తున్న దృశ్యం

హవేళిఘణాపూర్(మెదక్): అతివేగానికి ట్రాక్టర్ అదుపు తప్పి గుంతలో పడిన ఘటనలో వ్యక్తి మృతిచెందాడు. మరొకరికి గాయాలయ్యాయి. ఈ సంఘటన మండల కేంద్రంలో శుక్రవారం జరిగింది. తెలిసిన వివరాల ప్రకారం.. బి.తిమ్మాయిపల్లి వాసి పెద్దబోయిన లింగం(40) ఇదే గ్రామానికి చెందిన ప్రశాంత్‌తో కలిసి గ్రామశివారు పల్లెపోచమ్మ గుడి వైపు కంకర లోడు తెచ్చేందుకు బయలుదేరారు. మార్గమధ్యలో అతివేగానికి ట్రాక్టర్ అదుపు తప్పి రోడ్డు పక్కన గుంతలో దూసుకెళ్లి బోల్తా పడింది. విషయం తెలుసుకున్న స్థానికులు ఘటన స్థలానికి చేరుకొని జేసీబీ సహాయంతో వాహనం కింద చిక్కుకొనిపోయిన లింగాన్ని బయటికి తీశారు. అతను అప్పటికే మృతిచెందాడు. ప్రశాంత్‌కు గాయాలయ్యాయి. అతడిని చికిత్స నిమిత్తం 108లో మెదక్ ఆస్పత్రికి తరలించారు. ఈ సంఘటనపై తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని ఎస్ఐ తెలిపారు.

దశదిన కర్మ స్నానానికి వెళ్లి..

చెరువులో మునిగి వ్యక్తి మృతి



రమేశ్

చేగుంట(తూప్రాన్): దశదిన కర్మ స్నానం చేసేందుకు చెరువులో దిగిన వ్యక్తి ప్రమాదవశాత్తు కాలు జారి పడి మృతిచెందాడు. ఈ సంఘటన చేగుంటలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలకేంద్రానికి చెందిన బక్క రమేశ్(28)కు మహేశ్ వరుసకు సోదరుడవుతాడు. ఇతని దశదిన కర్మ కోసం తాను బంధువులతో కలిసి ఊర చెరువులో స్నానం చేసేందుకు వెళ్లాడు. అలా వెళ్లిన అతడు ప్రమాదవశాత్తు కాలు జారి నీట మునిగి లోపలికి జారుకుపోయాడు. బంధువులు వెంటనే తేరుకొని రమేశ్‌ను రక్షించి వెంటనే ఆస్పత్రికి తరలించారు. వైద్యులు పరీక్షించి అప్పటికే మృతిచెందినట్లు నిర్ధారించారు. మృతుడి తల్లి బుజ్జి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ హరీశ్ తెలిపారు.





కబడ్డీలో సత్తా చాటిన ఉమ్మడి మెదక్ జిల్లా బాలబాలికల జట్టు

బాలబాలికల కబడ్డీ జట్ల సత్తా

మెదక్ కలెక్టరేట్: బాలబాలికల కబడ్డీ జట్లు సత్తా చాటాయి. బాలికల జట్లు అండర్ -14, 17 విభాగాల్లో ప్రథమస్థానం, బాలుర జట్లు అండర్ 14,17 విభాగంలో ద్వితీయ స్థానం సాధించడంపై డీఈఓ రాధాకిషన్ హర్షం వ్యక్తం చేశారు. శుక్రవారం సంగారెడ్డి జిల్లా కేంద్రంలో గల డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ స్టేడియంలో ఉమ్మడి మెదక్ జిల్లా కబడ్డీ క్రీడోత్సవాలు జరిగాయని తెలిపారు. ఇందులో సంగారెడ్డి డీఈఓ వెంకటేశ్వర్లు చేతులమీదుగా ఈ జట్ల సభ్యులు బహుమతులు అందుకున్నారని వివరించారు. ఉమ్మడి మెదక్ జిల్లా తరఫున రాష్ట్ర స్థాయి కబడ్డీ జట్లలో బాలికల విభాగంలో అండర్ -14లో ఐదుగురు, 17లో ఐదుగురు, బాలుర విభాగంలో అండర్14లో నలుగురు, 17లో నలుగురు ఎంపికయ్యారని డీఈఓ తెలిపారు.



రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన క్రీడాకారులు

క్రాస్ కంట్రీ చాంపియన్‌షిప్‌లో ప్రతిభ

మెదక్ కలెక్టరేట్: 9వ రాష్ట్ర క్రాస్ కంట్రీ చాంపియన్‌షిప్ అండర్-16, 18, 20 బాలబాలికల విభాగాల్లో క్రీడాకారులు ప్రతిభ చాటారు. స్థానిక ఇందిరాగాంధీ స్టేడియంలో జరిగిన పోటీల్లో 32 మంది సత్తా చాటి మెడల్స్ పొందారని జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ కార్యదర్శి మధుసూదన్ పేర్కొన్నారు. వారు ఈనెల 23న కామారెడ్డిలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారని తెలిపారు.

రుణపాశం.. విషాదం

- భార్య, ఇద్దరు పిల్లలను చంపి.. ఏఆర్ కానిస్టేబుల్ ఆత్మహత్య
- ఉసురు తీసిన ఆర్థిక ఇబ్బందులు
- మృతుడు నరేశ్ కలెక్టర్ గన్‌మెన్
- ఘటనా స్థలాన్ని పరిశీలించిన సీపీ శ్వేత
- రామునిపట్లలో విషాదఛాయలు



సాక్షి, సిద్దిపేట/సిద్దిపేట కమాన్: ఆర్థిక సమస్యలు, ఆన్‌లైన్ రమ్మి గేమ్ ఓ కుటుంబానికి శాపంగా మారింది. కలెక్టర్ ప్రశాంత్ జీవన్ పాటిల్ దగ్గర పీఎస్ఓ (గన్‌మెన్)గా విధులు నిర్వర్తిస్తున్న ఏఆర్ కానిస్టేబుల్ ఆర్థిక ఇబ్బందులను తట్టుకోలేక తన భార్య, ఇద్దరు పిల్లలను గన్‌తో కాల్చి.. తానూ ఆత్మహత్యకు పాల్పడటం కలకలం రేపింది. చిన్నకోడూరు మండలం రామునిపట్ల గ్రామానికి చెందిన ఆకుల నరేశ్(35), చైతన్య(30) దంపతులకు కుమారుడు రేవంత్(7), కూతురు హితాశ్రీ(5) ఉన్నారు. సిద్దిపేట పట్టణంలోని సహస్ర స్కూల్‌లో చైతన్య టీచర్‌గా విధులు నిర్వహిస్తుండగా.. అదే పాఠశాలలో కుమారుడు రేవంత్ 2వ తరగతి, కుమార్తె హితాశ్రీ ఒకటో తరగతి చదువుతున్నారు.

అప్పుల ఊబిలోకి..

రమ్మి గేమ్, ఇంటి నిర్మాణం కోసం చేసిన అప్పులు ఎక్కువ కావడంతో నరేశ్ కొంతకాలంగా ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతున్నాడు. రుణదాతల నుంచి ఒత్తిడి పెరగడంతో మూడు నెలల క్రితం గ్రామంలోని ఎకరం వ్యవసాయ భూమిని విక్రయించగా వచ్చిన రూ 24.80 లక్షలతో కొంత అప్పు తీర్చాడు. అయినా అప్పుల కొండ కరగలేదు. మరికొంత భూమిని విక్రయిద్దామని ఉమ్మడి కుటుంబ సభ్యులతో చర్చించినా వారు సుముఖత చూపలేదని తెలిసింది. దీంతో తీవ్ర మనోవేదనకు గురైన నరేశ్.. అప్పు తీర్చే మార్గం కానరాక ఈ దారుణానికి ఒడిగట్టాడు.

ఉలిక్కి పడ్డ రామునిపట్ల

సిద్దిపేటలో నివాసం ఉంటున్న నరేశ్ కుటుంబం ఇరవై రోజుల క్రితం రామునిపట్ల గ్రామంలోని తన సొంత ఇంటికి మకాం మార్చింది. నరేశ్ ఇక్కడి నుంచే ప్రతిరోజు డ్యూటీకి వెళ్లి వస్తున్నాడు. రోజు మాదిరిగానే శుక్రవారం డ్యూటీకి వెళ్లి నరేశ్ రిపోర్ట్ చేశాడు. కలెక్టర్ సెలవులో ఉండటంతో తిరిగి ఇంటికి వచ్చే ముందు భార్య చైతన్యకు ఫోన్ చేసి స్కూల్ బస్సులో వెళ్లకండి.. తానే స్కూల్‌కు డ్రాప్ చేస్తానని చెప్పాడు. దీంతో స్కూల్ బస్సు ఎక్కాల్సిన భార్య, ఇద్దరు పిల్లలు ఇంట్లోనే ఉండిపోయారు. పిల్లలు స్కూల్ యూనిఫాం, కాళ్లకు సాక్స్‌లు ధరించి, లంచ్ బాక్స్‌లు, బ్యాగ్‌లు సర్దుకుని స్కూల్‌కు వెళ్లడానికి సిద్ధంగా ఉన్నారు. ఇంటికి చేరుకున్న నరేశ్.. ఇంట్లోకి వెళ్లి తన దగ్గర ఉన్న 9ఎంఎం సర్వీస్ పిస్టల్‌తో మొదట భార్య చైతన్యను, తర్వాత ఇద్దరు పిల్లలను పాయింట్ బ్లాంక్‌లో కాల్చి దారుణానికి ఒడిగట్టాడు. అనంతరం అదే గన్‌తో తన కణతిపై కాల్చుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. అతి సమీపం నుంచి కాల్పులు జరపడంతో నలుగురు అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు.

పిల్లలు ఏం పాపం చేశారు..?

ఈ ఘటనతో రామునిపట్ల గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. నరేశ్ కుటుంబం మొత్తం రక్తపు మడుగులో విగత జీవులుగా పడి ఉండటాన్ని చూసి స్థానికులు కన్నీరుమున్నీరయ్యారు. అభం, శుభం తెలియని చిన్నారులు మృతిచెందడంతో ఊరంతా దుఃఖసాగరంలో మునిగితేలింది. చిన్నారుల మృతదేహాలను చూసిన ప్రతి ఒక్కరు అయ్యో పాపం.. పిల్లలు ఏం పాపం చేశారు.. దేవుడా ఎంత పని చేశావు..? అని రోదించారు. కన్న పిల్లలు అని చూడకుండా తండ్రి కర్కశంగా కాల్చి చంపడాన్ని తీవ్రంగా కలచివేసింది.

ఘటనా స్థలానికి సీపీ శ్వేత



సమాచారం అందుకున్న సిద్దిపేట పోలీసు కమిషనర్ శ్వేత ఘటనా స్థలానికి చేరుకున్నారు. ఘటనకు గల కారణాలపై ఆరా తీశారు. ఆర్థిక ఇబ్బందులే కారణమై ఉండొచ్చని ప్రాథమికంగా అంచనాకు వచ్చామని మీడియాకు తెలిపారు. క్షణికావేశంలో ఒక కుటుంబం బలికావడం దురదృష్టకరమని వ్యాఖ్యానించారు. కేసును దర్యాప్తు చేస్తున్నామని, త్వరలో అన్ని విషయాలు వెల్లడిస్తామని సీపీ తెలిపారు.



విగత జీవులుగా చైతన్య, నరేశ్, ఇద్దరు పిల్లలు

టీచర్ల కంటతడి

సిద్దిపేట కమాన్: సిద్దిపేట పట్టణం ఆదర్శకాలనీలోని సహస్ర స్కూల్‌లో చదువుతున్న రేవంత్, హితాశ్రీలు క్లాస్‌లో ఎంతో చురుగ్గా ఉండే వారని, చదువుల్లో ఫస్ట్ వచ్చే వారని ఉపాధ్యాయులు చెప్పారు. ఎంతో అల్లరి చేస్తూ, ముద్దు ముద్దు మాటలతో సందడి చేసేవారని, కానీ నేడు ఇలాంటి పరిస్థితిలో చూస్తామని కలలలో కూడా అనుకోలేదని వారు కంటతడి పెట్టుకున్నారు. చైతన్య కూడా ఎంతో కలుపుగోలుగా ఉండేదని, స్నేహభావంతో మెలిగే వారని తమతో గడిపిన జ్ఞాపకాలను తోటి టీచర్లు గుర్తు చేసుకున్నారు.

చదువుల్లో చిన్నారులు ఫస్ట్

చైతన్య మృతి కలిచివేసింది



ప్రతి రోజు స్కూల్‌కు రాగానే తోటి టీచర్లను తప్పకుండా పలకరిస్తూ లోపలికి వెళ్లేది. ఎంతో కలుపుగోలు తనం, స్నేహభావం ఎక్కువగా ఉండేది. చైతన్య మృతి చెందిన విషయాన్ని నమ్మలేకపోతున్నాం. మమ్మల్ని ఎంతో కలిచివేసింది. శుక్రవారం ఉదయం పాఠశాలకు చైతన్య రాకపోవడంతో తనకు ఉదయం 9గంటలకు ఫోన్ చేయగా.. లిఫ్ట్ చేయలేదు. సుమారు 11:30గంటల సమయంలో ఈ విషయం తెలియడంతో బాధపడ్డాం.

– కవిత, తోటి టీచర్

హితాశ్రీ ఎంతో యాక్టివ్



ఘటనలో మృతిచెందిన హితాశ్రీ క్లాస్‌తో ఎంతో యాక్టివ్‌గా ఉండేది. ఎల్‌కేజీ చదువుతున్న సమయంలో ఇంటెలిజెంట్‌గా ఉండటంతో యూకేజీ కాకుండా నేరుగా ఫస్ట్ క్లాస్‌లోకి ప్రమోట్ చేయడం జరిగింది. పెద్దయ్యాక డాక్టర్ అవుతానని చెప్పేదని.. కానీ, ఇలా అర్ధంతరంగా తన జీవితం ముగుస్తుందని అనుకోలేదని చెప్పుకుంటూ సుమలత అనే టీచర్ కన్నీటి పర్యంతమైంది.

– సుమలత, టీచర్

అప్పు తీర్చకపోతే చావే మార్గం అంటూ చెప్పేవాడు



అప్పులు తీర్చకపోతే తనకు చావు తప్ప వేరే మార్గం లేదని నరేశ్ చెప్పేవాడు. ఈ నెల 10వ తేదీన అప్పులు చెల్లిస్తానని గడువు పెట్టాడు. ఏదో విధంగా ఐదు రోజులు నెట్టుకొచ్చాడు. నిన్న రాత్రి 9 గంటలకు (ఘటనకు ముందు రోజు) సైతం నరేశ్ తనను కలిశాడు. కానీ ఇంత పని చేస్తాడని అనుకోలేదు. నరేశ్‌ను కుటుంబ సభ్యులు పట్టించుకునే వారు కాదు. రూ.10 నుంచి రూ.20లక్షలు సాయం చేస్తే బతికే వాడు.

– రాజు, మృతుడి స్నేహితుడు

ఒకే చితిపై భార్యాభర్తల అంత్యక్రియలు

ఒకే గోతిలో ఇద్దరు పిల్లల ఖననం

సిద్దిపేటఅర్బన్: ఏఆర్ కానిస్టేబుల్ నరేశ్ కుటుంబం అంత్యక్రియలు అశ్రునయనాల మధ్య శుక్రవారం అర్ధరాత్రి స్వగ్రామం రామునిపట్లలో ముగిశాయి. వ్యవసాయ బావి వద్ద కుటుంబ సభ్యులు అంత్యక్రియలు నిర్వహించారు. భార్యాభర్తలు నరేశ్, చైతన్య మృతదేహాలను ఒకే చితిపై దహనం చేశారు. వీరి చితికి నరేశ్ తండ్రి నిప్పంటించారు. ఇద్దరు పిల్లల మృతదేహాలను ఒకే గోతిలో పెట్టి తాత అంత్యక్రియలు నిర్వహించారు. తనకు తలకొరివి పెట్టాల్సిన కుమారుడికి తాను తలకొరివి పెట్టాల్సి వచ్చిందని నరేశ్ తండ్రి బోరున విలపించాడు. భార్యాభర్తల చితికి పక్కనే గోతిలో పిల్లల మృతదేహాలను ఖననం చేశారు.



ఒకే చితిపై భార్యాభర్తల మృతదేహాలు



ఒకే గోతిలో ఇద్దరు పిల్లల ఖననం

తూప్రాన్‌లో దొంగల బీభత్సం



తూప్రాన్‌లోని ఓ ఇంటిలో చిందరవందరగా పడవేసిన వస్తువులు

తూప్రాన్: దొంగలు తూప్రాన్‌లో తాళం వేసిన ఇళ్లను టార్గెట్ చేశారు. మూడు ఇళ్లలో నగదు, బంగారు ఆభరణాలు దోచుకెళ్లగా, మరో ఇంటిలో చోరీకి యత్నించారు. వివరాలు ఇలా ఉన్నాయి. పట్టణంలోని కింది వాడకట్టులోని తాళం వేసిన జంగం శ్రీనివాస్ ఇంటిలో రూ.50 వేల నగదు, అర తులం బంగారం, ఆశం ఇంటిలో రూ.65 వేల నగదు, 15 గ్రాముల బంగారం, దానబోయిన సాయిలు ఇంట్లో రూ.20 వేల నగదు, 5 గ్రాముల బంగారం ఆభరణాలు దోచుకెళ్లారు. మరో ఇంటిలో చోరీకి యత్నించారు. చుట్టు పక్కల వారు ఉదయం గమనించి బాధితులకు విషయం తెలపడంతో వారు ఇంటికి చేరుకొని పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు క్లూస్ టీం ద్వారా దొంగల వేలి ముద్రలు సేకరించారు.

‘కార్తీక’ సిరులు

- కాసులు కురిపించిన కార్తీకమాసం
- శ్రీలక్ష్మీనృసింహ స్వామి దర్శించుకున్న 75 వేల మంది భక్తులు
- సేవలు, పూజల ద్వారా రూ 25.57 లక్షల ఆదాయం
- హుండీ ద్వారా మరో రూ.10 లక్షలు అంచనా

నాచారంగుట్ట నారసింహుడి పుణ్యక్షేత్రం. కార్తీక మాసంలో భక్తులతో కళకళలాడింది. వేలాదిమంది స్వామిని దర్శించి మొక్కులు చెల్లించారు. ముఖ్యంగా సోమవారాలు క్షేత్రం మరింత శోభాయమానంగా అలరారింది. ఆర్జిత సేవలు, సత్యనారాయణ స్వామి వ్రతాలు, అభిషేకాలు, కల్యాణాలు, ప్రత్యేక పూజా కార్యక్రమాలతో శివకేశవులకు ప్రీతికరమైన కార్తీక మాసం కాసులు కూడా కురిపించింది. ఈ ఒక్క మాసంలోనే రూ.25.57 లక్షల ఆదాయం ఆలయానికి సమకూరింది.

వర్గల్(గజ్వేల్): ఉమ్మడి జిల్లాలో సుప్రసిద్ధమైన నాచారంగుట్ట పుణ్యక్షేత్రానికి ఈ కార్తీక మాసంలో అధిక ఆదాయం సమకూరింది. రాష్ట్రం నలుమూలల నుంచి వచ్చిన భక్తుల తాకిడితో హుండీలో రాబడి పెరిగింది. కార్తీక మాసం నవంబర్ 14వ తేదీన ప్రారంభమై డిసెంబర్ 12తో ముగిసింది. ఈ మాసంలో క్షేత్ర సందర్శన, వ్రతాలు, అభిషేకాలు, దీపారాధన ఎంతో శుభకరమని భక్తులు విశ్వసిస్తారు. దీంతో శివకేశవుల నెలవైన నాచగిరి క్షేత్రానికి భక్తుల తాకిడి పెరిగి, నిత్యపూజలు, వ్రతాలు, కల్యాణాలు, నిజాభిషేకాలు, ఆర్జిత సేవలతో అలరారింది.

రూ 25.57 లక్షల ఆదాయం

కార్తీకమాసంలో స్వామిని 75 వేల మంది భక్తులు దర్శించారు. మొత్తం 1,755 సత్యనారాయణస్వామి వ్రతాలు జరిగాయి. ప్రత్యేక దర్శనం, శీఘ్రదర్శనం ద్వారా రూ.1,78,190, శ్రీసత్యనారాయణస్వామి వ్రతాల ద్వారా రూ.8,76,500, స్వామివారి కల్యాణాల ద్వారా రూ.2,15,000, సేవల ద్వారా రూ.1,17,150, కుంకుమార్చన, దీపారాధన ద్వారా రూ.82,944, అభిషేకాల ద్వారా రూ.1,04,800, లడ్డూ ప్రసాదం విక్రయంద్వారా రూ.5,79,505, పులిహోర ద్వారా రూ.3,13,565, వడ ద్వారా రూ.34,015, తలనీలాలు, కేశఖండన ద్వారా రూ.27,730, వాహన పూజల నుంచి రూ.28,100 ఆదాయం లభించింది. మొత్తం రూ.25,57,499 ఆదాయం సమకూరింది. దానికి అదనంగా హుండీ సొమ్ము మరో రూ.10 లక్షల వరకు ఉంటుందని అంచనా వేస్తున్నారు.



శ్రీలక్ష్మీనారసింహుడు



నాచగిరి ఆలయం

భక్తుల తాకిడి పెరిగింది..



కార్తీక మాసంలో సుమారు 75 వేల మంది భక్తులు శ్రీలక్ష్మీనృసింహ స్వామివారిని దర్శించుకున్నారు. దీంతో క్షేత్రానికి రూ.25లక్షలపై చిలుకు ఆదాయం సమకూరింది. భక్తులకు ఇబ్బంది కలగకుండా చర్యలు తీసుకున్నాం.

– అన్నపూర్ణ, ఆలయ ఈఓ

కార్తీకమాసంలో ఆలయ ఆదాయం

	వివరాలు	సంఖ్య	ఆదాయం (రూ.లలో)
1	ప్రత్యేక, శీఘ్ర దర్శనం	9,638	1,78,190
2	అభిషేకాలు	214	1,04,800
3	కుంకుమార్చన	1,133	55,840
4	గరుడ, దంపతి సేవలు	243	1,17,150
5	శ్రీసత్యనారాయణ స్వామి వ్రతాలు	1755	8,76,500
6	కేశఖండన	754	27,730
7	వాహన పూజలు	222	28,100
8	ప్రసాదాలు	45817	9,27,085
9	స్వామివారి కల్యాణం	108	2,15,000
10	దీపారాధన		27,104
	మొత్తం		రూ. 25,57,499

విధులపై అవగాహన

సిబ్బంది కలిగి ఉండాలని అధికారులకు ఎస్పీ సూచన

మెదక్ మున్సిపాలిటీ: ప్రతి పోలీసు అధికారి విధుల పట్ల పూర్తి అవగాహన కలిగి ఉండాలని ఎస్పీ రోహిణి ప్రియదర్శిని సూచించారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని పోలీసు కార్యాలయంలో సిబ్బందితో నెలవారి నేర సమీక్ష జరిగింది. పెండింగ్ ఉన్న (అండర్ ఇన్వెస్టిగేషన్) కేసులలో గ్రేవ్, నాన్ గ్రేవ్ కేసుల గురించి సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. గ్రేవ్ నాన్ గ్రేవ్ కేసుల్లో ఇన్వెస్టిగేషన్ అంశాల గురించి అవగాహన కల్పించారు. పలు కేసుల్లోని నిందితులకు తప్పకుండా శిక్షలు పడేందుకు కృషి చేయాలని సూచించారు.

పొగమంచుతో ప్రమాదాలు

దట్టమైన పొగ మంచు కారణంగా రోడ్డు ప్రమాదాలు ఎక్కువగా జరిగే ఆస్కారం ఉన్నందున వాహనదారులు అప్రమత్తంగా ఉండాలని రోహిణి ప్రియదర్శిని సూచించారు. రోడ్డు భద్రతా నియమాలు పాటించని వారిపై తగు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. టెక్నాలజీ ద్వారా ప్రజలకు మరింత దగ్గరై సేవలు చేయడానికి సీసీ కెమెరాలు ఉపకరిస్తాయని తెలిపారు. అదనపు ఎస్.పి. మహేందర్, తూప్రాన్ డీఎస్పీ యాదగిరి రెడ్డి, ఎస్‌బీసీ దిలీప్ కుమార్, డీసీఆర్‌బీ సీఐ ప్రకాశ్‌గౌడ్, సీఐలు, ఎస్ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎస్పీ రోహిణి

హత్యాయత్నం కేసులో నిందితుడి అరెస్ట్

జహీరాబాద్: హత్యాయత్నం కేసులో నిందితుడిని అరెస్టు చేసి శుక్రవారం కోర్టులో హాజరు పరిచినట్లు సీఐ రాజు తెలిపారు. వివరాలు ఇలా ఉన్నాయి. మహారాష్ట్రలోని ఔరంగబాద్‌కు చెందిన బోస్లె బబ్లిబాయి, ఆమె భర్త సూర్‌కాస్, కుమారుడు సార్థిక్‌షిండే కుటుంబం జహీరాబాద్ శివారులోని గుడిసెలో నివాసం ఉంటున్నారు. వారి తెగకు చెందిన కొంత మంది అక్కడే గుడిసెలు వేసుకుని ఉంటున్నారు. వీరు భిక్షాటన చేస్తూ జీవనం సాగిస్తున్నారు. ఈనెల 14వ తేదీ రాత్రి అక్కడే నివాసం ఉంటున్న ప్రవీణ్‌రాజ్‌పుత్ కల్లు తాగి భార్య సంగీతతో గొడవ పడుతున్నాడు. సార్థిక్ షిండే వారిని విడిపించే ప్రయత్నం చేశాడు. ప్రవీణ్‌రాజ్‌పుత్ తాగిన మైకంలో సార్థిక్‌షిండేను కత్తితో పొడిచాడు. అడ్డు వచ్చిన బాధితుడి తల్లి బాబ్లి బాయిని కూడా గాయపర్చాడు. సార్థిక్‌షిండే సంగారెడ్డి ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. బాధితుడి తల్లి ఫిర్యాదు మేరకు పోలీసులు హత్యాయత్నం కేసు నమోదు చేశారు.



నిందితుడిని అరెస్ట్ చేసిన పోలీసులు

‘వికసిత్ సంకల్ప్’.. సంక్షేమమే

- కేంద్ర పథకాలు అర్హుల దరి చేరాలి
- నేడు ప్రధాని చేతులమీదుగా ప్రచార రథాల ప్రారంభోత్సవం
- కేంద్ర ప్రభుత్వ మినిస్ట్రీ ఆఫ్ హోమ్ అఫైర్స్ డైరెక్టర్ పొసుమి బసు స్పష్టీకరణ



మాట్లాడుతున్న పొసుమి బసు

మెదక్ కలెక్టరేట్: కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ చేరేలా అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని కేంద్ర ప్రభుత్వ మినిస్ట్రీ ఆఫ్ హోమ్ అఫైర్స్ డైరెక్టర్ పొసుమి బసు పేర్కొన్నారు. శుక్రవారం మెదక్‌కు వచ్చిన ఆమె కలెక్టరేట్‌లో అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు, జిల్లా అధికారులతో వికసిత్ భారత్ సంకల్ప్ యాత్రపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ పథకాలు గ్రాస్ రూట్ లెవెల్ చేరుకోవాలన్నదే ఈ యాత్ర ప్రధాన ఉద్దేశమని తెలిపారు. కేంద్ర ప్రభుత్వ పథకాలపై గ్రామీణ ప్రాంతాల ప్రజలందరికీ అవగాహన కల్పించాలని తెలిపారు. అలాగే ఎవరైనా అర్హులు ఉన్నట్లయితే వారు నమోదు చేసుకునేలా ప్రోత్సహించాలని సూచించారు.

ప్రధాని చేతులమీదుగా నేడు ప్రారంభోత్సవం

వికసిత్ భారత్ సంకల్ప్ యాత్ర ప్రచార రథాలను శనివారం సాయంత్రం 4 గంటలకు ప్రధాని మోదీ వర్చువల్‌గా ప్రారంభిస్తారని పొసుమి తెలిపారు. జిల్లాకు 10 (ఐఈసీ, వ్యాన్స్) ప్రచార రథాలు కేటాయించారని చెప్పారు. శనివారం నుంచి జనవరి 25 వరకు రోజూ ఒక్కో వాహనం రెండు గ్రామపంచాయతీల్లో పర్యటిస్తాయన్నారు. ప్రజలకు సంక్షేమ పథకాలపై అవగాహన కల్పిస్తాయని తెలిపారు. ఇందుకోసం రూట్ మ్యాప్, యాక్షన్ ప్లాన్ సిద్ధం చేయాలని సూచించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు మాట్లాడారు. జిల్లాకు 10 మొబైల్ వ్యాన్స్ చేరుకున్నాయని తెలిపారు. షెడ్యూల్ మేరకు రోజూ రెండు గ్రామపంచాయతీలను కవర్ చేసేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు.

సిగ్నల్స్ లేకుండా వాహనం పార్కింగ్

- వెనుక నుంచి ఢీకొన్న ద్విచక్రవాహనదారుడి దుర్మరణం
- అర్ధరాత్రి గౌరారం రాజీవ్ రహదారిపై ఘటన



బైండ్ల భూపతి (ఫైల్)

వర్గల్(గజ్వేల్): అర్ధరాత్రి చీకట్లో పార్కింగ్ సిగ్నల్స్ లేకుండా రోడ్డుపై నిలిపిన భారీ వాహనాన్ని ద్విచక్ర వాహనదారుడు ఢీకొని అక్కడికక్కడే దుర్మరణం చెందాడు. ఈ ఘటన వర్గల్ మండలం గౌరారం సమీపంలో రాజీవ్ రహదారిపై గురువారం అర్ధరాత్రి తరువాత జరిగింది. గౌరారం ఎస్ఐ విజయభాస్కర్ తెలిపిన వివరాల ప్రకారం ములుగు మండలం నర్సంపల్లికి చెందిన బైండ్ల భూపతి(48) మర్కూక్ మండలం పాతూరులో మైసమ్మ పండగ పూజ చేసేందుకు వెళ్లాడు. పూజ ముగించుకుని గురువారం అర్ధరాత్రి దాటిన తరువాత గౌరారం రాజీవ్‌రహదారి మీదుగా తన బైక్‌పై నర్సంపల్లికి తిరిగొస్తున్నాడు. ఈ క్రమంలో గౌరారం శివారులో పార్కింగ్ సిగ్నల్స్, ఇండికేటర్స్ పెట్టకుండా రోడ్డుపై నిలిచిఉన్న భారీ వాహనాన్ని వెనక నుంచి ఢీకొనడంతో అక్కడికక్కడే దుర్మరణం చెందాడు. ప్రమాదానికి కారణమైన డ్రైవర్ వాహనంతో సహా పరారయ్యాడు. మృతుడి కుమారుడు భానుకుమార్ ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ట్రాక్టరును ఢీకొని యువకుడి మృతి



సాయికుమార్ రెడ్డి



రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన సాయికుమార్‌రెడ్డి

కొండపాక(గజ్వేల్): బైక్‌పై వెళ్తూ ట్రాక్టర్‌ను ఢీకొట్టడంతో ఓ యువకుడు మృతి చెందాడు. ఈ సంఘటన కుకునూరుపల్లి పోలీస్ స్టేషన్ పరిధి రాంచంద్రాపూర్ శివారు రాజీవ్ రహదారిపై శుక్రవారం సాయంత్రం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. కరీంనగర్ పట్టణానికి చెందిన ఆకారపు సాయికుమార్‌రెడ్డి హైదరాబాద్‌లోని ఓ ప్రైవేటు కంపెనీలో ఉద్యోగం చేస్తున్నాడు. బైక్‌పై కరీంనగర్ నుంచి హైదరాబాద్ వెళ్తున్నాడు. ఈ క్రమంలో రాంచంద్రాపూర్ గ్రామానికి వెళ్లేందుకు ట్రాక్టర్ యూ టర్న్ తీసుకుంటుండగా అతడు వెనుక నుంచి ఢీకొన్నాడు. బలమైన గాయాలవడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. కుకునూరుపల్లి పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం సిద్దిపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు.

నిందితుడిపై కేసు నమోదు

శివ్వంపేట(నర్సాపూర్): బాలికపై లైంగిక దాడికి పాల్పడిన నిందితుడిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ రవికాంత్‌రావు శుక్రవారం తెలిపారు. మండల పరిధిలోని చండి గ్రామానికి చెందిన చిన్నారిపై ఇదే గ్రామానికి చెందిన ఎంచర్ల దుర్గయ్య గురువారం లైంగిక దాడికి పాల్పడినట్లు పేర్కొన్నారు. బాధితురాలి తల్లి ఫిర్యాదు మేరకు నిందితుడిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.